ప్రణయబంధము

పెమ్మరాజు రాజగోపాలము గారు బి. ఏ., సారస్వత సమాజము

౧

సూర్యు డస్తమించేడు. కాని యింకా చీకటిపడలేదు. సంజచాయలు నీలాకాశము మీద మెఱసిపోతూన్నవి. చల్లని మందమారుతం విసరుతోంది.

ఆమనోహరసమయాన ఒక యువకుడూ ఒక యువతీ నరసాపురమునకూ రుస్తుంబాదాకీ మధ్యనున్న ఒకమామిడితోటలో కూర్చున్నారు. అక్కడ మనుష్య సంచారమేమీ లేదు.

ఆయువకుడికి పదహారేళ్లు వుంటాయి. శ్యామసుందరమైన దాతని శరీరకాంతి. విశాలమైన వక్షస్థలమూ, సన్నని నడుమూ, బలిష్ఠములై వర్తులములైన చేతులూ, కాళ్లూ, చూడడానికే అతి డొకవ్యాయామకర్కశగాత్రుడని ప్రకటిస్తాయి.

దగ్గరికి పోయిచూస్తే మొగముకూడా అందమైనదనే తెలుస్తుంది. అన్నిటికన్న బాగా ఆకర్షించే వాతని విశాలనేత్రాలు. అతని పెద్దకన్నులలోనుంచి ప్రశాంత ప్రేమ తొల్కాడుతూ వుంటుంది. ఎప్పుడూ చిరునవ్వు వెన్నెలకాస్తూ వుంటుందాతనిగులాబీ పెదవులమీద. ఆతన్ని చూస్తే మళ్లీ చూడాలనీ, అతనితో మాట్లాడితే మళ్లీ మాట్లాడాలనీ అతనిదగ్గిర కూర్చుంటే ఎప్పుడూ కూర్చోవాలనీ వుంటుంది.

అతని కెదురుగుండా కూర్చున్న ఆ యువతికి కూడా అంతే వయస్సుంటుంది. ఆమె ఒక పైట పరికిణీ నల్లయిమిటేషను సిల్కుది కట్టుకుంది. లేసుకుట్టిన జాకెట్టు తొడిగింది. మేజోడు, నల్లరంగు లేడీబూట్సూ తొడుక్కుంది. పొడుగాటి కృష్ణవేణి వెనుక జీరాడుతోంది. మెడలోని చంద్రహారమూ, మధ్య మిలమిల లాడుతోవున్న చమ్కీబెల్టు ఆమెకు క్రొత్తఅందం తీసికొని వచ్చినవి.

ఆమె శిరీషకుసుమకోమలనవకాంచనగాత్ర మతినాజూకైనది. ఆ సన్నని సుందరశరీరం లతవలె కంపించి పోతూవుంటుంది. ఆమె సోగకన్నులు ప్రణయపూరసపడి

పూర్ణాలు. ఆ ముగ్ధమోహనకల్యాణరమణీయాకృతి దర్శనీయమైనదని చెప్పితీరాలి. అప్పుడా యువకుడు "రత్నం! వెడదామా? కాస్సేపు కూర్చుందామా?" అన్నాడు. దానికి

కమలరత్నము

కాస్సేపు కూర్చుందూ. ఆనందం! అప్పుడే వెళ్ళిపోవాలేమిటీ ?

ఆనందరావు

నాకేం? నేనెంతసేపైనా కూర్చుంటా? నిన్ను మీవాళ్లేమైనా అంటారేమో అని అన్నాను అంతే.

కమలరత్నము

ఔను లే నీమాటానిజమే? ముందు మావాళ్ల మాటెల్లావున్నా చీకట్లో వెళ్లడము నాకే భయం.

ఆనందరావు

సరే, అందుకనే పెందరాళే వెడతాము. రేపింతకంటె ముందుగావచ్చి కూర్చుందాము. కాని ఆరోజుకంటె ఆరోజు మన స్నేహం ఎక్కువైపోతోంది. రుస్తుంబాదా వెడతానా —మళ్లీ వచ్చి ఎప్పుడు నీదగ్గిర వాల్దామా అనిపిస్తుంటుంది. ఇక నిన్నువిడిచి వుండలేను సుమీ? కమలం!

కమలరత్నము

మగవాడవు నీకే అల్లాగువుంటే ఇంక నామాట చెప్పాలా? నువ్వుస్కూలుఫైనలు ప్యాసైయ్యాక కాలేజీకి వెడితే యెల్లాగో?

ఆనందరావు

నువ్వుమాత్రము ప్యాసవ్వవూ? ఇద్దరం వెడదాము కాలేజీకి.

కమలరత్నము

అప్పుడిద్దర మిల్లా కలుసుకునేందుకు వీలవుతుందా?

ఆనందరావు

సరే లే అప్పటిమాట చూసుకుందాము? ఇకలే చీకటిపడుతోంది. 41 యింటి దాకావచ్చి నిన్ను దిగబెట్టి నేను వెడతాను.

అన్నాడు. ఇద్దరూ పుస్తకాలు పట్టుకొని బయలుదేరారు. ఆసమీపాన్నే వున్న ప్రాకారావృతమైన యింటిదొడ్డి గుమ్మము దగ్గిర ఆమెను దిగబెట్టి ఆనందరావు రుస్తుంబాదాకై వెళ్లిపోయాడు.

౨

ఆనందరావు రుస్తుంబాదాకు చెందిన సంపన్న గృహస్థుడగు నొక బ్రాహ్మణునికి కుమారుడు. ఆ బ్రాహ్మణుని పేరు కామయ్య. ఆయన గొప్ప యీనాందారు. ఆనందరావొక్కడే ఆయనకు కొడుకు. అందుచేత వానిన్ని అల్లారుముద్దుగా పెంచేడు. ఆంగ్లవిద్యాభ్యాసంకూడా చేయిస్తున్నాడు. అతడిప్పుడు స్కూలుఫయినలు చదువుతూవున్నట్లు మనకు తెలిసిన విషయమే.

కమలరత్నం ఒక క్రైస్తవ యువతి. ఆమె తండ్రిపేరు జ్ఞానప్రకాశం. అతడు లేసు వర్తకమువల్ల చాలాధనం గడించేడు. రుస్తుంబాదాకి నరసాపురానికి మధ్యనున్న ఒక తోటలో అతడు చక్కని బంగాళా కట్టేడు. అతని కిరువురు తనయులూ ఒక చిన్నపిల్లవాడూ సంతతి. ఉన్నవారందరిలో కమలరత్నమే పెద్దది. సంస్కరణాభిలాషి కనుక జ్ఞానప్రకాశము కమలాన్ని యింగ్లీషుబడికి పంపించేడు. ఆమెకూడా చాలా చురుకైంది. అచదువు బాగా వస్తోంది. ఆనందరావుతో సమానంగా స్కూలుఫైనలులోకివచ్చింది. చిన్నప్పటినుంచీ ఆనందరావూ కమలమూ ఒక్క డివిజనులోనే పడుతూవచ్చేరు. క్లాసులో మేష్టరు కొకవైపున కమలం మరొకవైపున ఆనందం కూర్చునేవారు. రుస్తుంబాదానుంచి ఆనందం సరిగ్గా వాళ్లయింటిదగ్గరకు వచ్చేసరికి కమలరత్నంకూడా గుమ్మందిగి వచ్చి కలుసుకొనేది. ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ స్కూలుకి వెళ్లేవారు. వచ్చేటప్పుడుకూడా అలాగే జోడుగావచ్చేవారు. ఒకప్పుడు స్కూలునుంచి మామూలుకంటె ముందుగావస్తే యిద్దరూకలిసివచ్చి యేతోట్లోనో కూర్చునేవారు.

ఆనందరావు చాలా తెలివైనవాడు. ఎప్పుడూ క్లాసులో ఫస్టుమార్కు వచ్చేది. అందుచేత కమలానికి అతనంటే ప్రేమతోపాటు గౌరవముకూడా యెక్కువైంది. ప్రతి రోజూ ఆనందరావుచేత పాఠాలు చెప్పించుకొనేది.

వాళ్లిద్దరినీచూస్తే జ్ఞానప్రకాశానికి చాలా సంతోషంగా వుండేది. ఆనందరావుని చూచి "నువ్వుకూడా క్రిష్టియానిటి పుచ్చుకోవయ్యా! మాఅమ్మాయిని పెండ్లాడుదువు గాని" అనేవాడు. దానికి ఆనందం నవ్వుతూ "నే నొక్కనాటికి పుచ్చుకోను" అనేవాడు.

ఆనందరావు కిరస్తానీవాళ్ల పిల్లతో స్నేహంచేస్తున్నాడనీ వాళ్లింటికి వెళుతున్నాడనీ కామయ్య విన్నాడు. ఆమాట వినగానే ఆయనవొళ్లు మండిపోయింది. కొడుకుని పిలిచి "ఏమిరా! నువ్వుకూడా కిరస్తానీ వెధవవైపోతావా? యీమాటుదానితో మాట్లాడినా దానింటికి వెళ్లినా" నిన్ను చావకొట్టి యింట్లోనుంచి వెళ్లకొడ్తాను. జాగ్రత్త" అః చెప్పి, జ్ఞానప్రకాశము దగ్గరకువెళ్లి "నువ్వు మావాణ్ని మతంచెడకొట్టడానికి నీయింటికి రప్పిస్తున్నావు. ఇదిమొదలుకొని వాణ్ని నీయింటికిరానిచ్చినట్లు తెలిస్తే నీమీద చార్జీయిస్తా" నని గట్టిగా చెప్పేశు. అది మొదలుకొని జ్ఞానప్రకాశము ఆనందరావుని తనయింటికి రావద్దని చెప్పేడు.

అదిగాక కమలరత్నం ఆనందంకూడా యుక్తవయస్సులోకి వచ్చేరు. అందుచే వాళ్లే లోకానికి వెఱచి, బాహాటముగా కలిసి తిరుగడం మానేసారు. అందుచేతనే వాళ్లిద్దరూ మనకథాకాలమునాటికి ప్రతిరోజూవచ్చి, ఆమామిడితోటలో కలిసికొనేవారు. క్రమ క్రమంగా వారిస్నేహమల్లా ప్రేమగామారింది. ఆప్రేమకూడా ప్రణయావేశంలోకి దిగేలావుంది.

3

"నువ్వునాతో ఎప్పుడూ చెప్పేవుకావీసంగతి" అన్నాడు ఆనందరావు.

కమలరత్నము

ఔను. చెప్పలేదు. ఆసందర్భము వచ్చినప్పుడు చెప్పవచ్చుకదా అని చెప్పలేదు ఇప్పుడైతేఏం?

ఆనందరావు

ఏసందర్భం? (అనినవ్వేడు.)

కమలరత్నము

నానోటమ్మట చెప్పిద్దామని కాబోలు యీరాకడ? (అనిచిరునవ్వునవ్వింది.)

ఆనందరావూ, కమలరత్నమూ యిద్దరూకూడా స్కూలు ఫయినలు ప్యాసయిన తర్వాత రాజమండ్రీ ఆర్ట్సుకాలేజిలో యింటరుమీడియట్టు తరగతిలో చేరారు. ఇప్పుడు బియ్యే చదువుచున్నారు.

వారిద్దరికీ ఒకరంటె ఒకరికిఅపరిమితమైన ప్రేమకుదిరింది. ఇద్దరూ ప్రతిరోజూ కలుసుకొనేవారు. సినీమాలోకిద్దరూకలసి వెళ్లేవారు. ఎడబాటు దుస్సహముగావుండేది. ప్రపంచమంతా ముంచెత్తుచున్న నవీనవాఙ్మయములో పాండిత్యంగడించేరు. ఇద్దరి హృదయ

యాలలో కూడా సుకుమారభావబీజాలు మొలక లెత్తేయి. జాతి మత విభేదాల నతిక్రమించి, ప్రేమప్రవాహములో పవిత్రస్నానుచేసి, ప్రణయబంధంచేత కట్టుపడి, ఆజన్మం సుఖిద్దామనే తలంపు దృఢపడిపోయింది.

నాడావిషయమే వారు ప్రసంగిస్తూవున్నారు. ఆవేళ శనివారం. మనోహరమైన ప్రభాత సమయం. ప్రపంచకానికి లోకబాంధవుడు నూతనసందేశ మందిస్తున్నాడు. పిల్లగాలి మెల్లగా శరీరాలకి సోకి ప్రేమపులకితగాత్రులని చేస్తోంది.అప్పుడు సల్లాపసంగ మందుకొని

ఆనందరావు

మీ తాతగారు బ్రాహ్మడన్నమాట. మరి క్రిష్టియానిటి ఎందుకు పుచ్చుకొన్నాడు?

కమలరత్నము

మానాన్నగారికి చిన్నతనంలో చాలాజబ్బుచేసిందట ఎన్నిమందులు వేశినా కుదురలేదట. అప్పుడు మనవూళ్లో ఒక దొరసానివుండేది. అది మంచివైద్యురాలు. ఆవిడదగ్గిరకు తీసికొని వెడితే "యీజబ్బు నేను కుదురుస్తాను. మీరు క్రైస్తవమతము పుచ్చుకొంటారా" అందిట. మనస్సువైకల్యం పొందివున్న ఆసమయంలో మా తాతగారు మానాన్నగారల్లా అంటె బతుకుతారే మీా అని చెప్పి క్రిష్టియను మతము పుచ్చుకొన్నారు. మతాతగారుపోగానే బ్రాహ్మలంతా కలిసి మావాళ్లను వెలి వేసేరు. బంధువులంతా వెలివేసేరు. అందుచేత వచ్చి పూసబయట యిల్లు కట్టుకన్నారు.

ఆనందరావు

మీ తాతగారికి హిందూమతంమీద ఎక్కువ అభిమానమా? క్రిష్టియను మతం మీద ఎక్కువ అభిమానమా?

కమలరత్నము

మా తాతగారికి హిందూమతమందే ఎక్కువ అభిమానమట. క్రిష్టియనులైకూడా హిందూఆచారాలే చేసేవారట. వీలైతే ప్రాయిశ్చిత్తంచేసుకొని హిందూమతంలో కలుద్దామని చూసారుట. కాని పూర్వాచారపరాయణులు సాగనిచ్చారుకారట.

ఆనందరావు

అది చాలా అన్యాయం సుమీ, కమలం! ఇతర మతాలన్నీ మతాంతరులనికూడా వాళ్లమతాల్లో కలిపికొని వాళ్ల వాళ్ల మతాలు వ్యాప్తిపొందేలాగు చేసుకొంటూ

వుండగా మావాళ్లు మనోదౌర్బల్యంచేత ఎవళ్లేనా ఒక్కమాటు పొరబడితే వాళ్లకిక నిష్కృతి లేకుండా చేసేరు. ఇది చాలాఘోరం, మామతం మావాళ్ల మీదే తలుపులు బిగించుకు కూర్చుంది. ఇంతకీ మీనాన్న వుద్దేశ్యం ఏమిటి? నీకేమతంయిష్టం?

కమలరత్నము

(ఉద్వేగంతో) ఆనందం నువ్వల్లా అడిగితే నేనేమిచెప్పను? మాతండ్రికి మాత్రం హిందూమతంమీద కాక యితరమతాలమీద ఎందుకువుంటుంది? మేముమాత్రం హిందువులం కాము?—మాజన్మభూమిమాత్రం భారతదేశంకాదు? మేమున్నదిమాత్రం హిందూ వాతావరణంకాదు? మేము త్రాగేజలం, పీల్చేగాలి, తినేతిండీ, కట్టేబట్ట, ఉండేటీరు అంతా హిందూదేశసంబంధంకాదు? విత్తొకటినాటితే చెట్టొకటి మొలుస్తుందా? హిందువుల పండుగులే మాపండుగులు. వాళ్ల స్వాతంత్ర్యమే మాది. కాని ఏంచెయ్యం? ఆనందం! మీవాళ్లు మమ్మల్ని యింకరానివ్వరు. వారలకిమాత్రం మామీద నిజమైన గౌరవం వుందా? మమ్మల్ని తక్కువగా చూస్తారు. మేము పొందే బాధ నీకేమి తెలుస్తుంది?

అల్లా ఉద్రిక్తురాలై చెప్పుచున్న కమలరత్నాన్ని చూస్తే ఆనందరావుకి పాశ్చర్యం కలిగింది. ఆమెకన్నులు తేజస్ఫురితములై అభిమానంతో మెఱిసిపోతూన్నవి. జేవురించిన ముద్దు మొగం కెంజాయతో వింత చెలువం తీసికొనివచ్చింది. శరీరమంతా ప్రస్వేదాంకురాలు క్రమ్ముకొన్నవి. అధరస్పందన మవుతోంది. ఒక్కసారి ప్రేమరస మొలికేలాగు ఆనందరావుకేసి దీనంగాచూచి, చిగురుప్రేళ్లతో మొగంమీద ఘర్మకణాలు తుడిచివేసుకుంది.

అప్పుడు అనందరావానందోద్రిక్తుడై పోయాడు. ఒక్కమారు విస్ఫారిత నేత్రాలతో ఆమెసౌందర్యసుధ గ్రోలుకొని, ఆమె మృదుహస్తం తనచేతితో పట్టుకొని కళ్లుమూసేడు. కమలానికి కూడా నేత్రనిమీలన మయింది. మళ్లీ కళ్లువిప్పి

ఆనందరావు

కమలమూ! అల్లా అధైర్యపడకు. ఈ సంఘం ఎవ్వరూ మనల్ని శాసించేందుకు? భగవంతుడు నిర్మించాడీవిశ్వమంతా. ఆతని శాసనమే మన శాసనం. బ్రాహ్మణసంఘం మిమ్మల్ని రానియ్యకపోతే మీలో బ్రహ్మత్వం ఎక్కడికి పోతుంది? ఇకదాచడం ఎందుకు? కమలా! నేను నిన్నే వివాహం చేసుకో తలచేను. ప్రేమసూత్రం నీకిదివరకే కట్టేను. ఇక సంఘమేమి చేసికొన్నాసరే, లోకమేమన్నాసరే, ప్రేమతో ఏకమైపోదాం.

కమలరత్నము

. బాగా ఆలోచించుకో.

ఆనందరావు

(చేతిగడియారం చూచుకుంటూ) నాది స్థిరమైన సంకల్పమే. ఇక వెళ్లివస్తాను. పదిగంట లవుతోంది. మనకి తెలియలేదు.

అని లేచేడు. కమలరత్నం సాగనంపి ది వీధిగుమ్మముదాకవచ్చి. ఆనందరావు హొటాట్టలువేపు వెళ్లిపోయేడు. ఆలోచనాపూరితహృదయంతో కమలరత్నము తిరిగి వచ్చి కుర్చీలో ఆసీన అయింది.

౪

మధ్యాహ్నం పదకొండు గంటలవుతుంది. అప్పుడే కామయ్యనిత్యానుష్ఠాన కర్మలు చేసికొని దేవతార్చన కావించుకొన్నాడు. వీధిఅరుగుమీద కూర్చొనుసరికి తపాలావాడొక వుత్తరం యిచ్చేడు. అది ఆనందరావు వ్రాసినది. అందులో ఈ విధంగావుంది.

రాజమండ్రి.

శనివారము.

"ప్రియమైన తండ్రిగారికి,

నేను మీ రెన్ని సంబంధాలు కుదిర్చినా చేసికోనని చెపుతూవచ్చేను. దానికి కారణం అప్పటిలో మీరడిగినా చెప్పలేదు. ఇప్పుడు చెప్పవలసివచ్చి చెబుతూ వున్నాను. నేనుచిన్నప్పటినుంచీ కమలరత్నాన్ని ప్రేమించేను. కారణాంతరాలచేత వారు క్రైస్తవులైనా ఆదిలో హిందూమతానికి సంబంధించిన బ్రాహ్మలే. కమలరత్నం త్రికరణశుద్ధిగా క్రైస్తవ మతంవదలుకొంది. కనుక యిప్పుడు నాకమలం హిందూమతానికి సంబంధించిన బ్రాహ్మణబాలిక. ఇప్పుడు మాలవ్యా, శ్రద్ధానందా మొదలయిన మహా పురుషులంతాకూడా శుద్ధిమతమవసరమనీ ఇతర మతములలో కలిసినవారందరినీ హిందూ మతము మరల స్వీకరింపవచ్చుననీ చెపుతున్నారు. అందుచేత నేనుకూడా నిరంకుశమైన. హిందూ పూర్వాచారసంఘాన్ని అతిక్రమించి, నాకమలాన్ని మరల హిందువుని చేసి కొని అనతికాలంలో పరిణయమాడుతున్నాను. కనుక మీకు తెలియచేయడమైనది.

ఇట్లు, మీ ప్రియపుత్రుడు

ఆనందరావు

ఆఉత్తరము చదువుకొనుసరికి కామయ్య ఆరక్తనేత్రుడై పోయాడు. ఉద్రేకంతోటి శరీరం కంపించిపోతూంది. లేఖ అడ్డదిడ్డంగా మడిచి యింట్లోకి పోయాడు.

౫

సాయంకాలమయింది. సంజకాంతులు నీలాకాశంమీద రక్తవర్ణం చిత్రించినవి. ఆరావములతో పక్షిగుంపులు విస్తృతాకాశంమీద యెగిరిపోతూ వున్నవి.

అప్పుడు పెరటిదొడ్డిలోని పూలతోటలో వున్న రెండు కుర్చీలమీద ఆనందరావూ, కమలరత్నమూ కూర్చున్నారు. ఆనాటిపుదయమే శుద్ధిసంఘంవారిదగ్గిరనుండి కమలరత్నాన్ని మరల హిందూమతంలో కలియుట కనుమతించిన తంతివార్త వచ్చింది. ఆరాత్రి వారివివాహం జరుగబోతోంది.

అంచేత వారిద్దరూ మనోహరమైన పెండ్లిదుస్తులు ధరించివున్నారు. కమలరత్నం కబరీభరమంతా పూలమయం చేసికొంది. ఊదా బనారసుచీరకట్టుకొంది. ఆమె మనోహరాకారము చూచి తీరవలసిందే. లీలామాత్రముగా భూమిమీద క్షణకాలం విహరింపవచ్చిన స్వర్గభువనవాసినివలె వుంది. ఆనందాతిశయముచేత ఆనందరావు వియద్గమనం చేసేవానిలా వున్నాడు.

అంతలో విసవిస వారిచెంతకు కామయ్య చక్కావచ్చేడు. కోపంచేత ఆతని మొగం ఎఱ్ఱబాఱింది. ఒకవిధమైన ప్రబలావేశంవల్ల శరీరం తూగాడుతోంది. అయన్ని చూచేటప్పటికి కమలరత్నమూ ఆనందరావూ కూడా కంపించేరు. అప్పుడు

కామయ్య

అబ్బాయీ! మతభ్రష్టుండవు అయ్యావా?

ఆనందరావు

(నిశ్చలంగా) ఒక్కనాటికి కాలేదు. మీరు మాత్రం మూఢాచారాలంతగా పాటించకండి. ఉత్తరంలో సర్వంకూడా తెలియచేశాను.

కామయ్య

ఓరీ పశువా! నీ ఆంగ్లవిద్యాభ్యాసం యింతవఱకూ వచ్చిందా? పవిత్రమైన పూర్వాచారాలాచరించేవాళ్లంతా నీకు మూఢాచారపశులా? నువ్వీక్రిష్టియనుదాన్ని కట్టుకొని కులభ్రష్టు అవుతావా?

ఆనందరావు

ఈమె ఇప్పుడు క్రిష్టియనుకాదు. పవిత్రమైన హిందూస్త్రీ. ఈమె తాతగారు బ్రాహ్మణుడు. అదిగాక శుద్ధిసంఘంవారీమెను మళ్లీ హిందూసంఘంలో కలిపేరు.

కామయ్య

మూర్ఖుడా! ఒకమాటు పతితులై హిందూమతంలోనుండి వీడిపోయిన భ్రష్టుల్ని కలుపుకొనేందు కేశాస్త్రాలంగీకరించేయి? అర్థంలేకుండా మాట్లాడకు. ఈ వివాహం మానుకుంటావా? మానవా?

ఆనందరావు

నేనుమానను. ముమ్మాటికి మానను. నా అంతరాత్మ యీమె పవిత్రమైన హిందూ బ్రాహ్మణబాలిక అని చెపుతోంది. సంఘమేమన్నా సరే, మీరేమన్నా సరే, ప్రపంచమంతా నన్ను వెలివేసినా సరే, నేనీమెను—ప్రేమించాను—పెళ్లిచేసికోక మానను.

కామయ్య

బాగా ఆలోచించుకో. చెడిపోతావు. నాకు మతం ప్రధానముకాని ప్రేమకాదు. జాగ్రత్త ఆస్తిఅంతా నాస్వార్జితం. నీకొక్క గుడ్డిగవ్వ ఇవ్వను. ఇవ్వను. నీమూలాన్ని శిష్టసాంప్రదాయ మనిపించుకొన్న వంశానికి అప్రతిష్ట తేకు. ఆఖరుసారి చెపుతున్నాను. ఆలోచించుకో?

ఆనందరావు

(అతిధైర్యంగా) మీరు తండ్రిగారుకదా అని పూజ్యభావంతో చూస్తున్నాను. మీస్వార్జితపుఆస్తిఅన్న నాకు తృణప్రాయం. ఇట్టిబెదరింపులు కట్టిపెట్టండి. నావల్ల వంశానికి గౌరవము రాకలదేమోకాని అప్రతిష్ట వస్తుందన్నమాట వట్టిది. నేను బాగా ఆలోచించే చెపుతున్నాను. నేనీమెను పెండ్లాడి తీరుతాను.

ఆమాట వినుసరికి కామయ్య శరీరంభగ్గుమంది. ఆగ్రహావేశంచేతరాక్షసుడై పోయాడు. ఒక్కక్షణంలో ముందుకు లంఘించి అక్కడవున్న గడ్డపారతీసి "ఛండాలుడా! మతభ్రష్టుడా!" అని విసరి కుమారుని కొట్టినాడు.

ఆవ్రేటుతో ఆనందరావు తల శకలములై పోయింది. చెవ్వున నెత్తురు ప్రాంతమెల్ల చిమ్ముకొంది. ఆనందరావు విలాసదేహం భూగతమైపోయింది. తోడనే పరమ కిరాతుని రాతిగుండెకూడ చీల్చుకొనిపోయెడు దీనారవముతో కమలరత్నము కెవ్వున కేకవైచి ఆనందరావు శరీరంమీద నువ్వెత్తుగా కూలిపోయింది.

ఏమిచేయగలడు కామయ్య. చేయిదాటిపోయింది. ఇరువురిని కదలించిచూచేడు. నిరంకుశసంఘాధికారబంధితమైన యిహలోకంవిడిచి స్వర్గలోకంలో కలియపోయారు.

కామయ్య అక్కడే స్థిరచితుడై నిలబడిపోయాడు.